తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి

సోమవారం 28 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8








# అటకెక్కిన అంగన్వాడీ భవనం..!

**❑అద్దె ఇంట్లోనే కొనసాగుతున్న కేంద్రం..❑ ఇబ్బందులు పడుతున్న బాలింతలు,చిన్నారులు**

**పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని స్థానిక ఎస్సి కాలనీ యందు ఉన్న అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం శిథిలావస్థ స్థితిలో ఉండడంతో అంగన్వాడి కేంద్రాన్ని అధికారులు అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.దీంతో చిన్నారులు, బాలింతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అద్దె ఇంట్లో తగినంత స్థలం,గాలి,వెలుతురు,తాగునీరు మరియు మరుగుదొడ్డి వంటి మౌలిక సదుపాయాలు లేక చిన్నారుల ఆరోగ్యం,భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. పోషకాహారం,ఆట వస్తువులు,రికార్డులు భద్రపరచడంలోనూ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే అంగన్వాడి భవనాన్ని బాగు చేపించాలని స్థానికులు కోరుతున్నారు.గతంలో అంగన్వాడి భవనం నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వలన అంగన్వాడి భవనం శిథిలావస్థ స్థితికి చేరుకుందని స్థానికులు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చిన్నారులకు,బాలింతలకు కనీస వసతులు,భద్రత కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు, స్ఫూర్తి చిరస్మరణీయం: కలెక్టర్ అంకిత్

**తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి..**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్27 (జనంసాక్షి):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని, ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో వార్తా లోపలి పేజీలో



## వారం రోజులుగా నిరంతరాయంగా గణేష్ నిమజ్జనాలు..

వార్తా లోపలి పేజీలో



## రైతన్నకు కడుపుకోత..

**అర్ధరాత్రి 12 మోటర్ల కేబుళ్లు చోరీ**

**గుర్రంపోడు సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు హల్‌చల్ చేశారు. గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో ఉన్న మోటర్లకు సంబంధించిన విద్యుత్ కేబుళ్లను కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఒకేసారి సుమారు 12 వ్యవసాయ మోటర్ల కేబుళ్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలకు నీరు అందించాల్సిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మోటర్ల కేబుళ్లు కట్ చేసి..బాధిత రైతుల వివరాల ప్రకారం.. కొప్పోలు గ్రామానికి చెందిన తిరుగుడు రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరిరెడ్డి, వరదారెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటర్ల కేబుళ్లను దుండగులు రాత్రి సమయంలో కట్ చేశారు. అనంతరం వాటిని తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు రైతులు తెలిపారు. రాత్రి సమయంలో వ్యవసాయ పొలాల వైపు ఎవరూ లేకపోవడాన్ని అదునుగా చేసుకున్న దుండగులు ఈ చోరీకి పాల్పడినట్లు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిగతా 2లో

## ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు..?

**రూ.10 వేల జరిమానా.. చివరకు రూ.5 వేలు!**

**○తూనికలు, కొలతల శాఖ అధికారి తీరుపై పలు ప్రశ్నలు**

**○మార్కెట్ ను ఏలుతున్న ప్రకాసుడు?**

**పాల్వంచ (జనంసాక్షి):** పట్టణ మార్కెట్‌లో తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో చోటుచేసుకున్న ఓ పరిణామం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తనిఖీల సందర్భంగా ఓ వ్యాపారికి కనీసం రూ.10 వేల జరిమానా విధిస్తామని అధికారి చెప్పినట్లు సమాచారం. అయితే అనంతరం ఫోన్‌లో మాట్లాడిన తర్వాత అదే వ్యవహారంలో రూ.5 వేల జరిమానా మాత్రమే విధించడం పలు అనుమానాలకు దారితీస్తుంది. నిబంధనల ఉల్లంఘనకు జరిమానా విధించే విషయంలో మొదట ఒక మొత్తం చెప్పి.. ఆ తర్వాత మరో మొత్తానికి తగ్గించడంపై స్పష్టత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు జరిమానా నిర్ణయానికి ప్రాతిపదిక ఏమిటి మొదట చెప్పిన రూ.10 వేల నుంచి రూ.5 వేలకు జరిమానా ఎందుకు తగ్గింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలోనీ మార్కెట్ ఏరియాలో అందరికీ నేనున్నానంటూ అందరి దగ్గర నెలవారి వసూలు చేస్తూ నేను ప్రతి ఒక్క శాఖను చూసుకుంటానని నేను చెప్పినట్లు అధికారులు వింటారని వారి వద్ద ప్రతినెల మామూలు వసూలు



చేస్తున్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. ముఖ్యంగా జరిమానా విషయంలో మార్పు చోటుచేసుకునే ముందు అధికారితో ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి ఎవరు? ఆయనకు, సదరు వ్యాపారికి లేదా ఈ వ్యవహారానికి ఉన్న సంబంధం ఏమిటి? ఫోన్ సంభాషణ అనంతరం జరిమానా మొత్తం ఎందుకు మారింది? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు వాపోతున్నారు.

# వారం రోజులుగా నిరంతరాయంగా గణేష్ నిమజ్జనాలు

## భారీ విగ్రహాలతో నెమ్మదించిన ప్రక్రియ.. మరో రెండు రోజులు పట్టే అవకాశం..



**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)**
భద్రాచలంలోని గోదావరి నదిలో గణేష్ నిమజ్జనాల ప్రక్రియ వారం రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. వినాయక చవితి సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను భక్తులు భారీ సంఖ్యలో భద్రాచలానికి తరలిస్తుండటంతో నిమజ్జనాల ప్రక్రియకు మరింత సమయం పడుతోంది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కాగా, ఇంకా పలు ప్రాంతాల నుంచి గణనాథులు భద్రాచలానికి చేరుకుంటున్నారు. పెద్ద విగ్రహాల సంఖ్య అధికంగా ఉండటంతో వాటిని నేరుగా గోదావరిలోకి తరలించడం సాధ్యం కాకపోవడంతో నది ఒడ్డున కొంతసేపు ఉంచి, వంతుల వారీగా నిమజ్జనం చేస్తున్నారు. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లాంచీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఒకే లాంచీ అందుబాటులో ఉండటంతో నిమజ్జనాల ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతోంది. మరోవైపు విగ్రహాల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది తక్కువగా ఉండటంతో అధికారులు అందుబాటులో ఉన్న వనరులతోనే నిమజ్జనాలను నిర్వహిస్తున్నారు. విగ్రహాల తరలింపు, నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. గోదావరి పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల రాక ఇంకా కొనసాగుతుండటంతో నిమజ్జనాల ప్రక్రియ పూర్తవడానికి మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలంలోని గోదావరి తీరం మరో రెండు రోజుల పాటు గణేష్ నిమజ్జనాలతో సందడిగా ఉండనుంది.

# పంచరాత్రాగమ శాస్త్రానుసారం శిల్పాల రూపకల్పన

❍ ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, అమ్మవార్ల శిల్పాల చెక్కడం ప్రారంభం..

❍ ఉత్తరద్వారానికి ప్రత్యేక శిల్పకళా సొబగులు..



**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)**
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాన్ని శిల్పకళా శోభితంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణంలో భాగంగా పంచరాత్రాగమ శాస్త్రం, శ్రీవైష్ణవ సంప్రదాయానికి అనుగుణంగా వివిధ దేవతామూర్తులు, ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, అమ్మవార్ల శిల్పాలను ప్రత్యేకంగా చెక్కుతున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శిల్పకళా వైభవంతో తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భక్త రామదాసు కాలంలో నిర్మించిన ఆలయ నిర్మాణంలోని పురాతన శిల్పాల స్థానంలో నూతనంగా రూపొందిస్తున్న ఆలయానికి అనుగుణంగా శిల్పాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లోని పురుషోత్తపట్నంలో ఉన్న గోకులరామం ప్రాంతం నుంచి ప్రత్యేకమైన శిలలను భద్రాచలానికి తీసుకొచ్చారు. శిల్పులు అక్కడే ఉండి పనులు చేపట్టేలా అవసరమైన నివాస సదుపాయాలను సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం, దేవస్థానం అందజేసిన ప్రత్యేక డిజైన్లు, నమూనాలకు అనుగుణంగా నిపుణులైన శిల్పులు శిలలను చెక్కుతున్నారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో పంచరాత్రాగమ శాస్త్ర సంప్రదాయానికి అనుగుణంగా నిత్య పూజా కార్యక్రమాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే ఆగమ సంప్రదాయానికి, శ్రీవైష్ణవ విధానాలకు అనుగుణంగా నూతన ఆలయంలో శిల్పాలను రూపొందిస్తున్నారు. ఆళ్వార్లు, భగవత్ మూర్తులు, లక్ష్మీ అమ్మవారు, రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఇతర అమ్మవార్లు, శంకర భగవత్పాదులు తదితర ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన మూర్తుల శిల్పాలను సుందరంగా మలచనున్నారు. ప్రత్యేకంగా నూతన రామాలయంలోని ఉత్తరద్వారాన్ని శిల్పకళా వైభవానికి ప్రతీకగా తీర్చిదిద్దేలా పనులు చేపడుతున్నారు. ద్వారానికి ఇరువైపులా, ఆలయ గోడలు, స్తంభాలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న శిల్పాలు భక్తులను ఆకట్టుకునేలా ఉండనున్నాయి. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ శిల్పాలు రామాలయానికి మరింత ప్రత్యేక శోభను తీసుకురానున్నాయి. భద్రాచలం రామాలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన నిర్మాణాల్లోనూ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారు. పురాతన ఆలయ వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న పునర్నిర్మాణ పనుల్లో భాగంగా శిల్పాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. నూతన రామాలయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత భక్తులకు ఆలయ శిల్పకళా వైభవం మరో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించనుంది.

# గౌతమీ తీరాన భక్తిశ్రద్ధలతో నదీహారతి

## పితృపక్షాల తొలిరోజు గోదావరి మాతకు ప్రత్యేక పూజలు



**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)**
భద్రాచలంలోని పుణ్య గోదావరి తీరంలో ఆదివారం సాయంత్రం నదీహారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భాద్రపద బహుళ పాడ్యమి, మహాలయ పితృపక్షాల ప్రారంభదినం కావడంతో గోదావరి మాతకు, శ్రీ సీతారామచంద్రస్వామివారికి, పితృదేవతలకు ప్రత్యేక హారతులు సమర్పించారు. భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ ఆధ్వర్యంలో కరకట్ట వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ పితృపక్షాల తొలిరోజున గోదావరి తీరంలో నదీహారతి నిర్వహించడం విశేషమన్నారు. గోదావరి హారతి విశిష్టతను, మహాలయ పితృపక్షాల ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. అనంతరం గణపతి పూజ, దీపోత్సవం నిర్వహించి, భక్తులచే దీపాలను వెలిగించారు. పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన నిర్వహించి లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ నదీహారతి కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటూ గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గోదావరి వరదలు తగ్గుముఖం పట్టి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని గోదావరి మాతను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించారు. రామవజ్జల రవికుమార్ దంపతులు, సత్యనారాయణరెడ్డి దంపతులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. నదీహారతి కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాద్రి పురోహితుల సంఘం సమకూర్చింది. ఈ కార్యక్రమంలో పురోహితులు ఉమామహేశ్వర ఆచార్య (శ్రీ చక్రపీఠం, ఖమ్మం), రామాచార్యులు, సత్యప్రసాద్ శర్మ, తేజ శర్మ, తిరుపతిరావు, సత్యనారాయణరెడ్డి, శివ, చంద్రశేఖర్ శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు, స్ఫూర్తి చిరస్మరణీయం:కలెక్టర్ అంకిత్

## తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి..

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం దీక్ష చేపట్టడంతో పాటు తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకుని ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు.సమాజంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన ఆస్తులను సైతం దానం చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆయన చూపిన సేవా, త్యాగ మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.విజయలక్ష్మి , వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, బీసీ సంఘ నాయకులు చిప్పా శ్రీనివాస్, ఇమ్మడి ఉదయ్ కుమార్, మోతుర్కి ధర్మారావు, బి సత్యనారాయణ, గమలాపురం సత్యనారాయణ, కొడుమూరు సత్యనారాయణ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు కడుపుకోత..

ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు మోటర్ల కేబుళ్లు కనిపించకపోవడంతో విషయం గుర్తించారు. ఒకరి తర్వాత మరొకరి పొలాల్లోనూ ఇదే తరహాలో కేబుళ్లు చోరీకి గురైనట్లు గుర్తించడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది.పంటలకు నీరందించడంలో ఇబ్బందులు.ప్రస్తుతం పంటలకు నీరు అందించాల్సిన కీలక సమయంలో మోటర్ల కేబుళ్లు చోరీ కావడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మోటర్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో బావుల నుంచి నీటిని పొలాలకు మళ్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కేబుళ్లను తిరిగి కొనుగోలు చేసి అమర్చుకోవాల్సి రావడంతో అదనపు ఖర్చు కూడా భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్రోలింగ్ పెంచాలి.వ్యవసాయ పొలాల వద్ద రాత్రి వేళల్లో వరుసగా చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో వ్యవసాయ బావులు, పొలాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గ్రామ పరిధిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. చోరీకి గురైన కేబుళ్లను గుర్తించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)**
భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేయాలని అధికారులు సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు గిరిజన దర్బార్ , ప్రజావాణి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ , సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా సమయానికి హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



- ఘనంగా చేనేత సహకార సంఘం 79వ వార్షికోత్సవ 62వ మహాసభ
- కేంద్ర, రాష్ట్ర పథకాలు అర్హులందరికీ అందేలా కృషి...
- చేనేత సహకార సంఘం చైర్మన్ పున్న ధర్మేంద్ర

**చండూరు, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట రోడ్డులో గల చేనేత సహకార సంఘం భవనం వద్ద సంఘం 79వ వార్షికోత్సవం, 62వ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం చైర్మన్ పున్న ధర్మేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ పున్న ధర్మేంద్ర మాట్లాడుతూ.. చేనేత సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి అందేలా కృషి చేస్తానని తెలిపారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అర్హులైన నేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేయించడంతో పాటు పద్మశాలి ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు.సంఘ కార్యదర్శి గంజి అశోక్ సంఘం క్యాష్ బ్యాలెన్స్, జమా-ఖర్చుల వివరాలను మహాసభలో సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోడిగిరి బాబు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుర్రం భిక్షమయ్య, మాజీ మండల పద్మశాలి అధ్యక్షుడు పున్న రాజు, ట్రస్ట్ చైర్మన్ కోమటి వీరేశం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రావిరాల నగేష్, గంజి శ్రీనుశెట్టి, సంఘ ఉపాధ్యక్షుడు చిరుపెల్లి కృష్ణ, కోశాధికారి కోమటి ఓంకారాం, తీరం దాస్ నరసింహ, జూలూరు వెంకటేశం, గుర్రం రాము, కవిత, తిరందాస్ శీను, సుధా, రాపోలు ప్రభాకర్, పున్న సైదులు తదితరులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థులే పాఠశాలకు ఆస్తి

**సూర్యాపేట (జనంసాక్షి):** పూర్వ విద్యార్థులే పాఠశాలకు ఆస్తి అని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన 8వ వార్షికోత్సవ సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, సమాజానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. తాము చదువుకున్న పాఠశాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవడం స్ఫూర్తిదాయకమని అన్నారు.పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం,పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.విద్యార్థి దశలో నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు.వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి తాటి చంద్రశేఖర్, కన్వీనర్ డాక్టర్ వేణుధర్, విద్యాసాగర్, డాక్టర్ పటేల్ నరసింహారెడ్డి, స్కూల్ హెచ్ఎం జీ.పద్మ, ఉపేందర్‌రెడ్డి, చిలువేరు రఘురాం, రాఘవాచారి, మహేందర్‌రెడ్డి, ముత్తంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛందంగా చౌటచెరువు గండి పూడ్చివేత

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి గ్రామంలో భారీ వర్షాలకు చాటచెరువు నిండి అలుగువద్ద గండిపడి నీరు వృధాగా పోతుంది. దీంతో గ్రామ సర్పంచ్ నున్న యాదగిరి స్పందించి ఆదివారం స్వచ్ఛందంగా జేసీబీని ఏర్పాటు చేసి గండి పూడ్చివేయించి నీరు వృధా కాకుండా చర్యలు తీసుకున్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని కలిసిన బిజెపి నాయకులు



**రామన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** రామన్నపేట మండలానికి చెందిన బిజెపి నాయకులు ఆదివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ని కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి రామన్నపేటలో గతంలో ఆపినటువంటి నారాయణాద్రి, ఫలక్నామా, పల్నాడు రైళ్లని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ఆపే విధంగా చర్య తీసుకుంటానని భరోసా ఇవ్వడం జరిగిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, సికింద్రాబాద్ ఇంచార్జ్ వీరెల్లి చంద్రశేఖర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.



## రైతులకు వ్యవసాయ యాప్‌లపై అవగాహన కల్పించిన అగ్రికల్చర్ విద్యార్థుల బృందం

**చింతలపాలెం(జనంసాక్షి)** చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలో ఆంధ్రా లయోలా కాలేజ్ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజ్ నాల్గవ సంవత్సరం బిఎస్సి వ్యవసాయ విద్యార్థిని కలరి జాహ్నవి మరియు ఆమె బృందం రైతులకు ఆధునిక వ్యవసాయ మొబైల్ యాప్‌లపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులు వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సదస్సులో కలరి జాహ్నవి మరియు ఆమె బృందం మాట్లాడుతూ,ప్రస్తుతం తెలంగాణలో రైతుల కోసం అందుబా టులో ఉన్న వివిధ ప్రభుత్వ వ్యవసాయ యాప్‌లతో పాటు ప్లాంటిక్స్ మరియు దామిని వంటి డిజిటల్ యాప్‌ల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ప్రత్యక్షంగా వివరించారు.స్మార్ట్‌ఫోన్ల ద్వారా పొలం గట్టు పైనుంచే వాతావరణ సమాచారం,చీడపీడల నివారణ మరియు ఎరువుల లభ్యత వివరాలను ఎలా తెలుసుకోవాలో రైతులకు స్క్రీన్లపై చూపిస్తూ అవగాహన కల్పించారు.సాంకేతికతను సరిగ్గా ఉపయోగించు కోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని,అధిక దిగుబడు లు సాధించవచ్చని రైతన్నలకు వివరించారు.తమ గ్రామానికి వచ్చి ఎంతో ఓపికగా డిజిటల్ వ్యవసాయంపై అవగాహన కల్పించిన ఆంధ్రా లయోలా కాలేజ్ విద్యార్థిని కలరి జాహ్నవి బృందాన్ని,వాళ్లని నడిపిస్తున్న గడ్డిపల్లి కెవికె అధికారులను గ్రామ రైతులు అభినందించారు.ఈ కార్యక్రమంలో దొండపాడు గ్రామ రైతులు,ఆంధ్రా లయోలా కాలేజ్ వ్యవసాయ విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మంకు చెందిన ఆయుర్వేద డాక్టర్ పీసీ వీరస్వామి కోరారు. కాసర్లపహాడ్ గ్రామంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం ఆధ్వర్యంలో మచ్చ వెంకటమ్మ, గడ్డం మల్లయ్యల జ్ఞాపకార్థం నేచర్క్యూర్, ఆక్యుపంక్చర్, నాడీ థెరపీల వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 100మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈకార్యక్రమంలో పీపీఎల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, ముత్యాలు, నర్సయ్య, మల్లయ్య, కృష్ణయ్య, పూలమ్మ, వెంకటమ్మ, లచ్చమ్మ, వెంకన్న పాల్గొన్నారు.



## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### సూర్యాపేటలో ఏఎస్ పీ క్రికెట్ అకాడమీ ప్రారంభం



**సూర్యాపేట (జనంసాక్షి):** చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రికెట్ అకాడమీలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఎస్పీ క్రికెట్ అకాడమిని మున్సిపల్ కౌన్సిలర్ షేక్.జహీర్, చివ్వెంల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు.చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఏఎస్పీ క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడంఅభినందనీయమన్నారు.తమ చిన్నారుల్లో క్రికెట్ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏఎస్పీ క్రికెట్ అకాడమిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కోచ్ శ్రీనివాస్, డి.వెంకన్న, సైదిరెడ్డి, మారం వెంకట్ రెడ్డి, భద్రు నాయక్, ఉపేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ జర్నలిస్ట్ నూకల నరేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి ఉత్తమ్

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** హుజూర్ నగర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నూకల నరేందర్ రెడ్డి సతీమణి స్వర్గీయ జానకి చిత్రపటానికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### అంబేద్కర్ అభయహస్తం కోసం

## అక్టోబర్ 5న బైక్ ర్యాలీ

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల రమేష్ మాదిగ**

**ఆత్మకూర్ (ఎం)జనంసాక్షి :** అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ల రమేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షులు కేదాస్ మోహన్ మాదిగ పిలుపుతో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతం కోసం ఆత్మకూర్ మండల కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూరెళ్ల రమేష్ మాదిగ మాట్లాడుతూ.. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయడంతో పాటు ఎస్సీల అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చాలని, అర్హులైన మాదిగలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 5న అడ్డగూడూరు మండల కేంద్రం నుంచి భువనగిరి జిల్లా కేంద్రం వరకు నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువసేన రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి వెంకట్ మాదిగ, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు కూరెళ్ల మత్స్యగిరి మాదిగ, యువసేన అధ్యక్షుడు ఉప్పల నర్సింహ, పంది రవీందర్, వస్తువుల ఎల్లయ్య, కదిరి నవీన్, ఉప్పల నాగరాజు, నార్కట్‌పల్లి సహదేవ్, నార్కట్‌పల్లి సోమయ్య, జోగు సాయిలు, కత్తుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ గా మేళ్లచెరువు ముక్కంటి నియామకం

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పల్లేటి లక్ష్మణ్ మాదిగను తొలగించి, మేళ్లచెరువు ముక్కంటి మాదిగను జిల్లా ఇంచార్జ్ గా నియమించి బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు నెలల్లో గ్రామ, మండల, నియోజకవర్గ నిర్మాణ కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కార్యాచరణ ప్రకటించారు. అనంతరం మేళ్లచెరువు ముక్కంటి మాట్లాడుతూ తనను ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇంచార్జ్ గా నియమించినందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ కి, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ కి, జాతీయ నాయకులు చింత బాబు మాదిగ, జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు కనుకు జానయ్య మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి కంటి అంబేద్కర్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి విజయభాస్కర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు చింత సైదులు, గుడపూరి ఉపేందర్, మిద్దె వెంకన్న, కడప పెంటయ్య, బచ్చలకూరి నాగరాజు, పాల్వాయి సూరయ్య, కందుకూరి నాగేశ్వరరావు, బుల్లెపంగు స్వామి, గడపంగు రాము తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



### బొజ్జ భిక్షం కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

### పిజిఆర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**గుర్రంపోడు: సెప్టెంబర్ 27 (జనంసాక్షి)** గుర్రంపోడు మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన బొజ్జ భిక్షం, దైద శేఖర్ రెడ్డి మృతి చెందడంతో వారి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ ఆదివారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బొజ్జ భిక్షం కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరపున అండగా ఉంటామని, కష్టకాలంలో వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్మా రెడ్డి, రామచంద్రం, కృష్ణ గౌడ్, యాదయ్య, కుమార్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి

**నూతనకల్ సెప్టెంబర్ 27( జనంసాక్షి)** నూతనకల్ మండల కేంద్రంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ మరియు గ్రామ మహిళా సమాఖ్య భవనముల శంకుస్థాపన చేయనున్నారని నూతనకల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసినదిగా అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనాలని వారు తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని నేతాజీ విద్యా మందిర్ లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివినపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో తమ యొక్క నాటి స్మృతులు మరిచిపోలేని మధురానుభూతులని అన్నారు. 26 ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, నేడు ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆపదలో ఉన్న తమ తోటి మిత్రులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బడుగుల లింగయ్య యాదవ్, నాటి ఉపాధ్యాయులు అంజయ్య, నరసింహారావు, భాను, జానీ, చంద్రయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల జట్టు ప్రథమ స్థానం

**తుంగతుర్తి సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతనకల్ మండల పరిధిలోని వెంకేపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గస్థాయి కబడ్డీ టోర్నమెంట్ 2026 అండర్?17 కబడ్డీ పోటీల్లో తుంగతుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది.ఈ పోటీల్లో తుంగతుర్తి పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా స్థాయి అండర్?17 కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు మరింతగా కృషి చేసి పాఠశాలకు, తుంగతుర్తి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# ఐకమత్యంతో చేనేత సంఘాన్ని అభివృద్ధి చేసుకుందాం

### పల్లెర్ల మిశ్రమ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పొడుగు వెంకటేశం

ఆత్మకూర్(ఎం)జనంసాక్షి :
పల్లెర్ల గ్రామంలోని మిశ్రమ చేనేత సహకార సంఘ భవనంలో సంఘ సర్వసభ్య సమావేశాన్ని అధ్యక్షుడు పొడుగు వెంకటేశం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత సంఘ భవన ఆవరణలో సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చేనేత కార్మికులు తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పొడుగు వెంకటేశం మాట్లాడుతూ చేనేత కార్మికులంతా ఐకమత్యంతో ముందుకు సాగి సంఘాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పాలకవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తించి ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశం అనంతరం బాపూజీ జయంతి సందర్భంగా



సంఘ పాలకవర్గ సభ్యులు సంఘ ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కందగట్ల వెంకటేశం, కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, కోశాధికారి సాయిని పురుషోత్తం, డైరెక్టర్లు వట్నాల వెంకటేష్, జంజీరాల సోమయ్య, గుర్రం మల్లేష్, ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు, రాపోలు శ్వేత వెంకటేష్, మాజీ అధ్యక్షుడు ఏలూరి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కస్తూరి ప్రభాకర్, మాజీ ఉపాధ్యక్షుడు సాయిని అశోక్, మాజీ డైరెక్టర్లు గుర్రం వాసుదేవ్, రాపోలు స్వామి, చేనేత నాయకులు ఏలే విశ్వనాథం, గుర్రం నర్సయ్య, గుర్రం నారాయణ, సాయిని వెంకటేష్, కందగట్ల వెంకయ్య, గుర్రం సంతోష్, పొడుగు సత్యనారాయణ, గుర్రం సురేష్, గుర్రం భిక్షపతి, గుర్రం చైతన్య, ఏలూరి లక్ష్మయ్య, కస్తూరి సంజీవ, కస్తూరి సత్యనారాయణ, సాయిని సురేష్, అకౌంటెంట్ వళ్ళందాస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి చికిత్సకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన మాలోతు బిచ్చు నాయక్



**తుంగతుర్తి సెప్టెంబర్ 27 (జనం సాక్షి)**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి సిగ్నేత కుటుంబానికి బాపన్ భాయ్ తండ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బ తండ గ్రామానికి చెందిన మాలోతు బిచ్చు నాయక్ ఆదివారం రూ.1,00,000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన కుంచం కళ్యాణ్ కుమార్తె సిగ్నేత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రమాదంలో చిన్నారి తల, చెవికి తీవ్ర గాయాలు కావడంతో ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం.ఈ విషయం తెలుసుకున్న మాలోతు బిచ్చు నాయక్ చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి, చికిత్సకు తనవంతు సహాయంగా రూ.1,00,000 అందించారు.ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన మాలోతు బిచ్చు నాయక్‌కు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ ఐ హాస్పిటల్ అధ్యక్షుడు మీలా మహదేవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట ఐ హాస్పిటల్,మలక్‌పేట యశోద హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ఉచిత వైద్య శిబిరాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు.ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలతో పాటు షుగర్, బీపీ, 2డీ ఈకో, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, గుండె, ఎముకలు, రక్తనాళాలు, సాధారణ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కెవి.ప్రసాద్, వైస్ గవర్నర్లు కోడె సతీష్, గుడిపూడి వెంకటేశ్వర్లు,కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, సెక్రటరీ పెండెం చంద్రశేఖర్, ట్రెజరర్ సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ మిర్యాల సుధాకర్, వైస్ చైర్మన్ తోట శ్యాంప్రసాద్, పీఆర్వో రాచర్ల కమలాకర్, యాదగిరి, చిలుముల సైదిరెడ్డి, మేనేజర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**తుర్కపల్లి,సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ లు అన్నారు. ఆదివారం తుర్కపల్లి బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో వీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్ కీ బాత్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలతో నేరుగా అనుసంధానమవుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, రైతులు, మహిళలు, యువతతో పాటు వివిధ రంగాల్లో దేశం సాధిస్తున్న ప్రగతిని ప్రజలతో పంచుకుంటున్నారని అన్నారు.ప్రధాని మోదీ ఆలోచనలు, దేశ నిర్మాణంపై ఆయన దూరదృష్టి ప్రతి కార్యకర్తకు స్ఫూర్తినిస్తాయని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యత అని అన్నారు.స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను ప్రోత్సహించడం, రైతులు, చిన్న వ్యాపారులు, యువత ,మహిళలకు అండగా నిలవడం ద్వారా వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత, రైతులు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుతాం

సూర్యాపేట (జనంసాక్షి):
సూర్యాపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బుల్లెట్ ట్రైన్ రావాల్సిన అవసరం ఉందని, బుల్లెట్ ట్రైన్ సూర్యాపేటకు వచ్చే వరకు మేరు సంఘం ముందుండి పోరాడుతుందని సూర్యాపేట పట్టణ మేరు సంఘం అధ్యక్షుడు మునగాల సతీష్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా 43వ రోజు దీక్షలో మేరు కులస్తులతో కలిసి ఆయన నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. బుల్లెట్ ట్రైన్ వస్తే ఈ ప్రాంతమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు.మొదట ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను అమలు చేయాలని కోరారు.బుల్లెట్ ట్రైన్ సాధన కోసం నిర్వహించే ఉద్యమ కార్యచరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు.బుల్లెట్ ట్రైన్ కోసం నిర్వహించే ఏ కార్యక్రమానికైనా మేర సంఘం పూర్తి మద్దతు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రేణిగుంట్ల నరేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి కర్నే ఉపేందర్, కోశాధికారి తెంబరేణి కృష్ణ, గట్ల వర్షమ్మ , సరస్వతి, గట్ల రమాశంకర్, సిద్ధప్ప, పద్మావతి, వీరేష్, సువర్ణ, లక్ష్మీనారాయణ, కిషోర్, సతీష్, సిద్ధప్ప, సాయి, సువర్ణ, రోజా, రమాదేవి, సరస్వతి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సేవ రత్న అవార్డు ప్రధానం

**రామన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
రామన్నపేట మండలంలోని పల్లవి మోడల్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, తెలుగు ఉపాధ్యాయురాలు పల్సం అనిత కు ఆదివారం సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. అనిత గత 20 ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ బోధన చేసినందుకుగాను జిల్లా ట్రస్మా వారు గుర్తించి సేవా రత్న అవార్డు ప్రధానం చేసినట్లు తెలిపారు.



## పాల్వంచలో యువకుడిపై దాడి: కేసు నమోదు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్27 (జనంసాక్షి):** వినాయక నిమజ్జన ఊరేగింపులో పాత కక్షలతో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన పాల్వంచలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. బాధితుడు గడ్డం సాయిరాం కథనం ప్రకారం. ఈ నెల 26న రాత్రి తమ కాలనీలో విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్లగా, పాత కక్షలతో కొల్లిపాక అరుణ్, అతని స్నేహితులు హరి మాధవ్, భూక్య పవన్ అతడిపై దాడికి దిగారు. అరుణ్ చేతి కడియంతో కొట్టడంతో సాయిరాం ఎడమ కన్నుపై తీవ్ర రక్తగాయమైంది. అడ్డువచ్చిన తల్లిదండ్రులను తోసివేసి, స్థానికులు వారించగా కత్తులతో బెదిరించి పరారయ్యారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## ఓటర్ల జాబితా అక్రమాలపై నిజాలు బయటపెట్టాలి

**ముదిగొండ, సెప్టెంబర్ 27, (జనంసాక్షి) :** ఓటర్ల జాబితాలో అక్రమాలు, డబుల్ ఓట్లు ఉన్నాయన్న ఆరోపణలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని మాధాపురం మాజీ సర్పంచ్ పడిశాల భద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం "దేశ ప్రజలారా.. ఒక్కసారి ఆలోచించండి" అంటూ బహిరంగ లేఖ విడుదల చేశారు. జాబితాలో డబుల్ ఓట్లు, అర్హత లేని ఓట్లు ఉంటే ఎక్కడ, ఎన్ని ఉన్నాయో ఆధారాలతో వెల్లడించాలని కోరారు. అక్రమ ఓట్లు ఉంటే తొలగించాలని, డబుల్ ఓట్లను సరిచేయాలని, మరణించిన వారి పేర్లు, నివాసం మారిన వారి వివరాలను నిబంధనల ప్రకారం సవరించాలని సూచించారు. అదే సమయంలో అర్హులైన ఒక్క ఓటరు ఓటు హక్కు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడాలన్నారు. యువత ఉద్యోగాలు, విద్య, భవిష్యత్తు, హక్కులపై ప్రశ్నిస్తున్న సమయంలో వారిపై ఆరోపణలు చేస్తూ అసలు సమస్యను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. ఎవరు తప్పు చేసినా ఆధారాలతో బయటపెట్టి చర్యలు తీసుకోవాలని, ప్రశ్నించే హక్కును కాపాడటమే ప్రజాస్వామ్యానికి బలం అని భద్రయ్య పేర్కొన్నారు.



## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల భేటీ

**గుర్రంపోడు సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** శిరిడీ సాయిబాబా దర్శనం అనంతరం పీజీఆర్ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మండల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, నాయకులు?కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు గొని కృష్ణ గౌడ్, వేముల యాదయ్య, రామచంద్ర, కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం అభిప్రాయాలను పంచుకుంటూ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్య నాయకుల సమావేశంతో మండల రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సమావేశంలో చర్చించినట్లు సమాచారం.



## పేదలకు అండగా 'నెల నెల వైద్యం'..

- బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవంతంగా మెడికల్ క్యాంప్..
- ఉచిత వైద్య సేవలు.. రూ.100కే మందుల అందజేత..

**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)** పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నెల నెల వైద్యం' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం భద్రాచలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సోమయ్య, బత్తుల హైమావతి మాట్లాడుతూ పోరాటాలతో పాటు ప్రజాసేవలోనూ కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. కరోనా సమయంలో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడుతున్న ఈ వైద్య శిబిరానికి అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ నీరజారెడ్డి, డాక్టర్ తేజస్విని ఉచితంగా వైద్య సేవలు అందించారు. సీపీఎం నాయకులు డాక్టర్ మిడియం బాబురావు, బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య తదితరులు శిబిరాన్ని పరిశీలించి ఏర్పాట్లను అభినందించారు. ముఖ్యంగా చక్కెర, రక్తపోటు బాధితులకు రూ.100కే మందులు అందించడం పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని పేర్కొన్నారు.



## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అతిథులకు ఘన సన్మానం

**బండారు ప్రాంతీయ సదస్సులో సేవా పురస్కారాల ప్రదానం**

**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి106 ఏ, రీజియన్?1 ఆధ్వర్యంలో భద్రాచలంలో నిర్వహించిన 'శ్రీవిద్యాధరమ్మ వాసవి ప్రాంతీయ సదస్సు?2026' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు విచ్చేసిన అతిథులు, ప్రముఖులకు వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఆత్మీయంగా చిరు సన్మానం చేసి ఘనంగా సత్కరించారు. భద్రాచలంలోని వాసవి కళ్యాణ వేదికలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ప్రతినిధులు, సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు హాజరయ్యారు. 'హిస్టరీ' థీమ్‌తో నిర్వహించిన సదస్సులో సేవా కార్యక్రమాలపై చర్చించడంతో పాటు విశిష్ట సేవలు అందించిన పలువురికి ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రతినిధులు పాల్గొని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. అతిథులకు వాసవి క్లబ్ భద్రాచలం సభ్యులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా 'సేవే లక్ష్యం.. సమాజమే కుటుంబం' అనే స్ఫూర్తితో వాసవి క్లబ్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

## ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి నూతన మండల కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్, ఎంఎస్పీ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు తురుగంటి అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీల ఎన్నిక నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడిగా మహంకాళి వీరబాబు మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా సిరిపురం బొందయ్య మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండల స్థాయిలో సంఘాలను మరింత బలోపేతం చేస్తూ మాదిగల హక్కులు, సామాజిక న్యాయం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి సంఘటిత శక్తిని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎం,ఎస్పీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఖమ్మంలో అక్టోబరులో ఐయూఎంఎల్ సభ

**కేరళ, తమిళనాడు నుంచి జాతీయ నేతలు.. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాక**

**ఖమ్మం, (జనంసాక్షి) :** తెలంగాణలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీని బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ జాతీయ నాయకత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అక్టోబరులో ఖమ్మం నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా తెలిపారు. సభకు కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పార్టీ జాతీయ నాయకులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఢిల్లీ, చెన్నై వెళ్లి జాతీయ నాయకత్వాన్ని సభకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

**తెలంగాణపై ప్రత్యేక దృష్టి**

ఇటీవల ఢిల్లీలో జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో దేశవ్యాప్తంగా పార్టీని విస్తరించడంతో పాటు అన్ని రాష్ట్రాల్లో సంస్థాగతంగా బలోపేతం చేయడంపై కీలకంగా చర్చించినట్లు బాజీ బాబా తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేసి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు నాయకులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి జాతీయ నాయకత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, అందులో భాగంగానే ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉప ఎన్నికతోపాటు గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉందని బాజీ బాబా తెలిపారు. ఆయా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దించే అంశంపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్నప్పటికీ.. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా తమతో కలిసి వచ్చే ప్రాంతీయ పార్టీలతో ముందుకు సాగడంపై జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పార్టీకి ఉన్న రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించాలన్న లక్ష్యంతో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బాజీ బాబా వెల్లడించారు. ఖమ్మం సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కౌన్సిల్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.



## బాబు వైద్యానికి మరో రూ.45 వేల ఆర్థిక చేయూత అందజేత..

భద్రాచలం సెప్టెంబర్ 27 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలంలో ఆదర్శనగర్ కాలనీకి చెందిన రోహిత్ అనే 12 ఏళ్ల బాలుడి అత్యవసర వైద్యానికి మన సమాచారం గ్రూప్ సభ్యులందరూ కలిసి రూ.45 వేల ఆర్థిక సహాయంను బాలుడి వైద్య ఖర్చుల కోసం గ్రూప్ సభ్యుల సహకారంతో ఈ మొత్తాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర సమయంలో స్పందించి బాలుడి కుటుంబానికి అండగా నిలిచిన మన సమాచారం గ్రూప్ సభ్యులు, ఆపదలో ఉన్న కుటుంబానికి తమవంతు సహాయం అందించడం ద్వారా మానవత్వం చాటుకున్నారని కొనియాడారు.






## డిగ్రీ, పీజీ ప్రవేశాలకు
# సెప్టెంబర్ 30 చివరి తేదీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 27(జనంసాక్షి):**
భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రం (ఉఆఅ ఃఅఓ-039)లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ విద్యా విస్తరణ కేంద్రం నోడల్ అధికారి, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ధర్మా నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ రెడ్యా నాయక్, ఖమ్మం ప్రాంతీయ సమన్వయకర్త వీరన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బి.ధర్మా నాయక్ మాట్లాడుతూ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులు, ప్రవేశ విధానం, విద్యా అవకాశాలను వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. అలాగే సమత సపోర్ట్ స్కీమ్ ద్వారా అందుతున్న విద్యా సహాయాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న విద్యా అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 30 చివరి తేదీ అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం. కిరణ్ కుమార్, కౌన్సెలర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రపంచ సంజ్ఞా భాష దినోత్సవ వేడుకలు

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
ఖమ్మం లోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఈరోజు ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బధిరులు అందరూ కలిసి సంజ్ఞా భాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైనా భాషకు తగిన విస్తృత ప్రచారం కల్పించవలసిందిగా కోరినారు. ఈ సందర్బంగా, బధిరిల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్, రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సంజ్ఞ భాషకు తగిన విస్తృత ప్రచారం కల్పించవలసిందిగా కోరినారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కా ర్యాలయాలలో సంజ్ఞ భాష పట్ల అవగాహన కల్పించవలసిందిగా మరియు టివి కార్యక్రమాలలో వార్తలలో సంజ్ఞ భాష వాడవలసిందిగా వారు కోరినారు. తెలంగాణ ప్రభుత్వం సంజ్ఞ భాష పట్ల ఎక్కడ లేని వివక్షత ప్రదర్శిస్తూ చాలా నిర్లక్ష్యం గా వ్యవహ రిస్తున్నదని, బధిరులాందరు తీవ్ర ఆవేదన చెందినారు. ప్రభుత్వం స్పందించి సంజ్ఞ భాషకి తగిన గుర్తింపు గౌరవం కల్పించి అన్ని ప్రదేశాలలో విరివిగా వాడే విధంగా చర్యలు తీసుకోవాలని బధిరులందరు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమమునకుఖమ్మం జిల్లా బధిర సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్, రామకృష్ణ, ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు వీరాస్వామి, మహేష్, ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఎగజీ క్యూటివలు సరిత, సాయికుమారి పాల్గొన్నారు. జయరాం, ప్రభాకర్ లు ప్రసంగించారు.

## రెండు బైకులు ఢీకొని
# ఇద్దరు వ్యక్తులు మృతి

**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**







రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా ఎరుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఎర్రుపాలెం మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఆంధ్రప్రదేశ్ చెందిన ఎన్టీఆర్ జిల్లా గంపల గూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరుకొప్పుల ప్రేమ్ కుమార్, (30) మరో వ్యక్తి ఆంధ్రాకు చెందిన మైలవరం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తి సగ్గుర్తి.రాంబాబు (45) గా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. వీరు ఇరువురు ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అలాగే బైక్ పై వెళుతున్న మరో పాపకు గాయాలైనట్లు తెలిపారు. ఎరుపాలెం, ఎస్సై, రమేష్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తిరుమలాయపాలెం మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక

- పీఆర్టీయూ నూతన అధ్యక్షుడిగా వై. నాగేశ్వరరావు
- ప్రధాన కార్యదర్శిగా టి. నాగార్జునరావు ఏకగ్రీవ ఎన్నిక
- రెండేళ్ల పాటు కొనసాగనున్న నూతన కార్యవర్గం
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న నూతన నాయకులు



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 27(జనంసాక్షి)**
తిరుమలాయపాలెం మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ ఎన్నికల ప్రక్రియలో నూతన అధ్యక్షుడిగా ఎర్రగడ్డ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన వై. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కాకరవాయి ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన టి. నాగార్జునరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలాంటి పోటీ లేకుండా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు ఏకాభిప్రాయంతో ఎన్నిక జరగడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవీకాలం రెండేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి. నాగార్జునరావు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తామని పేర్కొన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు వై. నాగేశ్వరరావు, టి. నాగార్జునరావులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.




## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో
# అతిథులకు ఘన సన్మానం

### - బండారు ప్రాంతీయ సదస్సులో సేవా పురస్కారాల ప్రదానం

**భద్రాచలం సెప్టెంబరు 27 (జనంసాక్షి)**
వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి106 ఏ, రీజియన్?1 ఆధ్వర్యంలో భద్రాచలంలో నిర్వహించిన 'శ్రీవిద్యాధరమ్మ వాసవి ప్రాంతీయ సదస్సు?2026' ఘనంగా జరిగింది. ఈ సందర్భం గా సదస్సుకు విచ్చేసిన అతిథులు, ప్రముఖులకు వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఆత్మీయంగా చిరు సన్మానం చేసి ఘనంగా సత్కరించారు. భద్రాచలంలోని వాసవి కళ్యాణ వేదికలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ప్రతినిధులు, సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు హాజరయ్యారు. 'హిస్టరీ' థీమ్‌తో నిర్వహించిన సదస్సులో సేవా కార్యక్రమాలపై చర్చించడంతో పాటు విశిష్ట సేవలు అందించిన పలువురికి ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు, వాసవి క్లబ్స్ అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రతినిధులు పాల్గొని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. అతిథులకు వాసవి క్లబ్ భద్రాచలం సభ్యులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా 'సేవే లక్ష్యం.. సమాజమే కుటుంబం' అనే స్ఫూర్తితో వాసవి క్లబ్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.

## గ్రామ పంచయతీల ప్రణాళికలపై అవగాహన సదస్సు

**పినపాక, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**



బయ్యారం క్రాస్ రోడ్ నందు గల జివిఆర్ ఫంక్షన్ హాల్ లో నేడు మధ్యాహ్నం రెండు గంటల నుంచి పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల అధికారులు, ప్రజాప్రతి నిధులకు వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనలపై అవగాహన సదస్సును నిర్వహించడం జరుగుతుందని పినపాక ఎంపీడీవో కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన వెలువడింది. ఈ అవగాహన సదస్సులో సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు , ఎంపీడీవోలు, ఎంపీవోలు ,ఉపాధి హామీ పథక సిబ్బందికి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో? గ్రామ స్థాయిలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన,ఉపాధి హామీ పథకం సంస్కరణలు, ఉపాధి హామీ పథకం మార్గదర్శకాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలి??పారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు , అధికారులు నిర్ణీత సమయానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.




## నేడే అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభల బహిరంగ సభ

**కదలిరండి.. ఖమ్మం రైతు కూలీల బహిరంగ సభకు తిరుమలాయపాలెం మండల అధ్యక్ష, కార్యదర్శులు గొర్రెపాటి వీరస్వామి, అచ్చా ఉప్పలయ్య పిలుపు**

**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 27( జనం సాక్షి)**
అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభల సందర్భంగా రేపు సెప్టెంబర్ 28న ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న మహాప్రదర్శన, బహిరంగ సభకు రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏఐకేఎంఎస్ తిరుమలాయపాలెం మండల అధ్యక్ష, కార్యదర్శులు గొర్రెపాటి వీరస్వామి, అచ్చా ఉప్పలయ్య పిలుపునిచ్చారు. రైతులు, రైతు కూలీల సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత బలోపేతం చేసేందుకు జరుగుతున్న ఈ జాతీయ మహాసభలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని వారు తెలిపారు. భూమి సమస్య పరిష్కారం, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతు కూలీలకు ఉపాధి, కూలి రేట్ల పెంపు, వ్యవసాయానికి అవసరమైన ఎరువులు సకాలంలో అందించడం, రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవడం వంటి డిమాండ్లపై రైతు కూలీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్న ఈ జాతీయ మహాసభలకు ఖమ్మం వేదిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. రైతు కూలీల హక్కుల కోసం జరిగే ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు తిరుమలాయపాలెం మండలం నుంచి రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో కదిలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



**తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ యోధుడు, తెలంగాణ బాపూజీగా పేరొందిన కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు యాదవ్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల చైతన్యం, ఆత్మగౌరవం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి వ్యక్తి గా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికే అంకితం చేసిన ఆయన ఎప్పుడూ పదవుల కోసం ప్రాకులాడలేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పగడాల సైదులు వార్డు సభ్యుడు శాగం రాంరెడ్డి, చిదళ్ళ లింగయ్య, వన్నెకంటి ముసలయ్య, జంగాల ఏడుకొండలు, కత్తి సైదిరెడ్డి, కోచెర్ల కోటేష్, జూపెల్లి గోపి, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ పార్వతమ్మ, బిల్ కలెక్టర్ బత్తుల శ్రీను, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




**ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.**



**అసమాన త్యాగాలకు ప్రతిరూపం కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు.**

**నేరేడుచర్ల జనంసాక్షి**

## స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ

**తుంగతుర్తి సెప్టెంబర్ 27(జనం సాక్షి)**
తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు, ఆదివారం మండల కేంద్రంలో బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, తెలంగాణ కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు, ముఖ్యంగా బీసీల హక్కుల కోసం తెలంగాణ సాధన కోసం పోరాడిన ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాలకు అనుగుణంగా పోరాటం చేసిన మహనీయుడని అన్నారు, ఈ కార్యక్రమం లో



మండలనాయకులు గోపగానిరమేష్. మట్టిపెల్లి వెంకట్. ఉప్పుల నాగమల్లు గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



**కోదాడలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి**

కోదాడ టౌన్ సెప్టెంబర్ 27 ( జనంసాక్షి );
నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా,తెలంగాణ సాధన కోసం నిరంతరం పోరాడిన త్యాగధనుడు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు పద్మశాలి సేవా సంఘం నాయకులు అన్నారు. ఆదివారం బాపూజీ 111వ జయంతి సందర్భంగా ప్రధాన రహదారిపై ఉన్న ఆయన విగ్రహానికి పద్మశాలి సేవా సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు కొంగర నరసింహారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన సేవలకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కొంగర నరసింహారావు,సంగిశెట్టి గోపాల్,గొర్రె రాజేష్,రుద్ర నాగలక్ష్మి,అనబత్తుల వేణు,గోలి నాగరాజు,పంతంగి నరేష్,పెండిప్రోలు శ్రీనివాసరావు,కొండ వీరభద్రం, శ్రీనివాస్,దేవరశెట్టి సైదులు,నరసింహారావు,నాగుల్, పరుశు రాముల,సురేష్,గూడూరి కుమార్,రచ్చ రామచంద్రయ్య,చిట్టి ప్రోలు కనకయ్య,నక్క చంద్రం,నక్క వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**రామన్నపేట, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను రామన్నపేట మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం





ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు, సమాజ అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు సంగిశెట్టి సుదర్శన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఈడెం శ్రీనివాసరాధా, మాజీ డిసిఎంఎస్ జిల్లా డైరెక్టర్ జెల్లా వెంకటేష్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, కార్యదర్శి నాగభూషణం, పున్న వెంకటేశం, వనం చంద్రశేఖర్, మండల చేనేత సహకారసంఘాల అధ్యక్షుడు పెండం వేణు, వరం సుధాకర్, వనం కిష్టయ్య, జిల్లా దత్తాత్రి, దొంత నాగరాజు, సూర్య పెల్లి చంద్రమోహన్, గంజి అశోక్, వనం విటల్, రచ్చ దయాకర్, గంజి చంద్రయ్య, పాండు, భవనాఋషి, బోడ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



**ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

**మేళ్లచెరువు జనం సాక్షి**
మండల కేంద్రంలో మెయిన్ రోడ్ నందు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు అవ్వరు.రాజు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ కొరకు తన మంత్రి పదవిని తృణప్రాయంగా విడిచి పెట్టారని, తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేశారని అతన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ అతని బాటలో నడవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో భావనారుషి దేవాలయ కమిటీ చైర్మన్ సామిలేటి రంగారావు , దామెర్ల.కోటేశ్వరరావు, మామిడి.కొండలు, గుంటి. ప్రసాద్,జిల్లా.నారాయణ, చీదిరాల ఎలమంద, ఊట్ల.చందు, మామిడి గణేష్, గద్దె నరేష్, శ్రీను, దామెర్ల.అంజి తదితరులు పాల్గొన్నారు.



**ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని అప్పం వీరయ్య మెమోరియల్ పద్మశాలి సంఘ భవనంలో స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు అప్పం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ కనిగిరి శ్రీరామ్, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర ఉద్యమంలో, తెలంగాణ తొలి మలిదశ ఉద్యమంలో తన చివరి క్షణాల వరకు నిస్వార్థంగా పోరాటం చేసిన మహా గొప్ప నాయకుడు అని కొనియాడారు.అనంతరం పద్మశాలి యువసేవ కోఆర్డినేటర్ పున్న వెంకన్న బాపూజీ జీవిత చరిత్ర మీద వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు క్యాష్ ప్రైజ్, ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గండూరి రమేష్, నాగుల శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ, యేలే సత్యనారాయణ, యలగందుల సుదర్శన్ , దూలం నగేష్, చిలువేరు నరసింహారావు, కడారి బిక్షం, యలగందుల సాయి, కనుకుంట్ల శారదా దేవి, గోడిశాల వెంకటేశ్వర్లు, బాల్నే క్రాంతి,మిరియాల సుధాకర్, కొంగరి ఉపేందర్, చిదిరాల శోభ తదితరులు పాల్గొన్నారు.

